విశాలాంధ్ర కృష్ణా జిల్లా

'స్వామిత్వ' వేగవంతం : కలెక్టర్ రంజిత్‌బాషా

విశాలాంధ్ర-మచిలీపట్నం: స్వామిత్వ కార్యక్రమం క్రింద గ్రామాల్లో సర్వే వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సర్వే, పంచాయతీ సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి స్వామిత్వ కార్యక్రమం క్రింద గ్రామాల్లో చేపట్టిన సర్వే పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడుతూ గ్రామాల్లో, గ్రామకంతాల్లో స్థలాలు, కొలతలు వేసి సర్వే చేయడం, ఎసెస్‌మెంట్ నెంబర్లు కేటాయించడం స్వామిత్వ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా 39 గ్రామాల్లో స్వామిత్వ చేపట్టి ఇప్పటి వరకు 5 గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.మహేష్‌కుమార్ రావిరాల, డిపివో నాగేశ్వరనాయక్, జడ్పీ సీఈవో జి.శ్రీనివాసరావు, డిఎల్‌డివో సుబ్బారావు, సర్వే ఎడి గోపాల్‌రాజ్, సూపరింటెండెంట్ కోఆర్డినేషన్ హరనాథ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

రూ.26.45 లక్షల పనులకు శంకుస్థాపన చేసిన పేర్ని

విశాలాంధ్ర-మచిలీపట్నం: మచిలీపట్నం మున్సిపాలిటీ పరిధిలో రూ.26.45 లక్షల విలువైన డ్రైనేజ్ పనుల నిర్మాణాలకు మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య(నాని) శంఖుస్థాపన చేశారు. బుధవారం 1వ డివిజన్‌లోని దేవుడుచెరువు నుంచి ఆనంద్‌పేటకు వెళ్ళే రోడ్లు, 41వ డివిజన్‌లోని 3 స్థంభాల సెంటర్ నుంచి చల్లపల్లి బైపాస్ రోడ్డు పరిధిలో నూతన సిసి డ్రైనేజి నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పేర్ని నాని మాట్లాడుతూ డిప్యూటీ మేయర్, 41వ డివిజన్ కార్పొరేటర్ లంకా సూరిబాబు, 1వ డివిజన్ కార్పొరేటర్ జోగి చిరంజీవి ఇరువురు గత కొంతకాలంగా తమ డివిజన్‌లలో డ్రైనేజ్ వ్యవస్థ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. వీటి పరిష్కార నిమిత్తం రూ.26.45 లక్షల వ్యయంతో నూతన సిసి డ్రైనేజిలను నిర్మించడానికి నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, కమీషనర్ చంద్రయ్య, డిప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత, లంకా సూరిబాబు, మున్సిపల్ మాజీ ఛైర్మన్ సిలార్‌దాదా, ఇతర కార్పొరేటర్లు పాల్గొన్నారు.

న్యాయపరిష్కార వేదికలు లోక్‌అదాలత్‌లు

మొదటి అదనపు జిల్లా జడ్జి

విశాలాంధ్ర-మచిలీపట్నం: లోక్‌అదాలత్‌లు సామాన్య ప్రజానీకానికి సత్వర న్యాయ పరిష్కారం అందించడానికి ఏర్పాటు చేసినవని కృష్ణాజిల్లా మొదటి అదనపు జిల్లా జడ్జి చిన్నంశెట్టి రాజు అన్నారు. బుధవారం న్యాయసేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నంశెట్టి రాజు మాట్లాడుతూ న్యాయ సహాయం అవసరమైన పేదవారికి సత్వర న్యాయ పరిష్కారం అందించాలనే ఉద్దేశ్యంతో 1987లో లోక్‌అదాలత్ న్యాయ వ్యవస్థను నెలకొల్పిందన్నారు. కోర్టుల్లో కేసులు ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉండిపోవడం, న్యాయం పొందడంలో జాప్యం జరుగుతున్న కారణంగా సత్వర న్యాయ పరిష్కారానికి ఈ లోక్‌అదాలత్ వ్యవస్థను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థకు సుప్రీంకోర్టు న్యాయమూర్తి, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థకు హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఛైర్మన్లుగా వ్యవహరిస్తారన్నారు. న్యాయసహాయం అవసరమైన పేదవారికి ఆయా న్యాయ సేవాధికార సంస్థల ద్వారా సత్వర న్యాయం అందించడం లోక్‌అదాలత్‌ల ప్రధాన ధ్యేయమని తెలిపారు. మధ్యవర్తిత్వం ద్వారా ఇరుపక్షాలకు రాజీ మార్గం ద్వారా సమాన న్యాయం అందిస్తుందని, తద్వారా సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందని చెప్పారు. జాయింట్ కలెక్టర్ డా.మహేష్‌కుమార్ రావిరాల మాట్లాడుతూ సత్వర న్యాయ పరిష్కారం పొందాలనుకునే వారికి లోక్‌అదాలత్‌లు ఒక గొప్ప మార్గాలు అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ప్రజలకు వివిధ చట్టాల మీద అవగాహన ఏర్పరచడంతో పాటు అవసరమైన వారికి న్యాయ సహాయం అందించడానికి కృషి చేస్తుందన్నారు. డిఎల్‌ఎస్‌ఎ కార్యదర్శి ఎ.పద్మ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు నిర్వహించిన అవగాహనా సదస్సులు, పరిష్కరించిన కేసుల వివరాలను తెలిపారు.

డిఎల్‌ఎస్‌ఎ ద్వారా పేదలకు అందుబాటులో న్యాయ సేవల గురించి అవగాహన కల్పించే ప్రత్యేక ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. అనంతరం కోర్టు ఆవరణ నుంచి జిల్లా కోర్టు సెంటర్ వరకు విద్యార్థులతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్‌అదాలత్ ఛైర్మన్ డా.ఎం.రామకృష్ణ, 6వ అదనపు జిల్లా జడ్జి ఎస్.చిన్నబాబు, 9వ అదనపు జిల్లా జడ్జి డా.షేక్ మహ్మద్ ఫజులుల్లా, 10వ అదనపు జిల్లా జడ్జి ఎ.నరసింహమూర్తి, మచిలీపట్నం బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్.ఎస్.ఆర్.కె.ప్రసాద్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, పారాలీగల్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అరాచక పాలనే సీఎం ధ్యేయం

విశాలాంధ్ర-పెదపారుపూడి : రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నాయకులు దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉమా మాట్లాడుతూ ఏ తప్పు చేయకపోయినా అయ్యన్నపాత్రున్ని అర్ధరాత్రి అరెస్టు చేయడం తప్పితే, రాష్ట్రంలో రైతుల ఇబ్బందులు కనిపించకుండా పోయాయని అన్నారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని, ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధర ప్రకటించే విధంగా చర్యలు చేపట్టాలని ఉమా సూచించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్ డ్యాములలో సాగునీరు పుష్కలంగా ఉన్నప్పటికీ దాల్వా పంటకు నీరు ఇవ్వలేమని చెప్పటం విడ్డూరంగా ఉన్నదని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్రలో ముద్దులు పెట్టారని, అధికారం వచ్చిన తర్వాత గుద్దులు గుద్దుతున్నాడని అన్నారు. రాష్ట్రంలో సామాన్య మానవుడు జీవించలేని పరిస్థితులు దాపరించాయని అందుకు అధిక ధరలే నిదర్శనం అని అన్నారు. ప్రతిపక్షాలను అణగదొక్కడం తప్ప, ప్రభుత్వానికి ప్రజలకు మేలు చేద్దామన్న ఆలోచన లేకుండా పోయిందని విమర్శించారు. ఈ రకంగా పరిపాలన సాగితే 175 స్థానాలకు, 175 దేవుడెరుగు కానీ, 151 లో అటు ఒకటి, ఇటు ఒకటి తొలగిస్తే ఐదు మాత్రమే మిగులుతాయని ఆయన జోష్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ వర్లకుమార్‌రాజా, మండల టీడీపీ అధ్యక్షులు చలసాని రమేష్‌చౌదరి, ప్రధాన కార్యదర్శి మసిముక్కు రాంబాబు, నాయకులు నాగదేసి విజయప్రకాష్, కలపాల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో ఇల్లు కోల్పోయినవారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేయాలి

విశాలాంధ్ర-గన్నవరం : విమానాశ్రయం నిర్మాణంలో ఇల్లు కోల్పోయిన వారికి వెంటనే ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజి అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్ళం వెంకటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దావాజిగుడెంలో సమస్యలు పరిష్కరించాలని బుధవారం రెండవ రోజు ధర్నా వారికి సీపీఎం నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విమానాశ్రయ విస్తరణలో ఇల్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం ప్రతి ఇంటికి రూ.9 లక్షలు, 5 సెంట్లు, భూమి ఇస్తామని చెప్పి 5 సెంట్లు భూమి ఇచ్చి 9 లక్షలు ఇవ్వలేదని ఆరోపించారు. ఇంటి అద్దె చెల్లిస్తామని ఒక సంవత్సరం నుండి అద్దె చెలించటలేదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చి భూమిలో మౌల్లిక సదుపాయాలు కల్పోయించాలని డిమెండ్ చేశారు. ఏసు రత్నం మాట్లాడుతూ ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా మా సమస్యలు పరిక్షరించటం లేదనివిమర్శించారు. ఈ కార్యక్రమంలో తాడి ప్రతాప్, బేతాల్లా కిరణ్, నిమ్మకూరు కిరణ్, కటూరి విజయ్, సర్పంచి బడుగు బాలమ్మ, నాయకులు బడుగు మరియదాసు, వై నరసింహారావు, అనుమోలు వెంకటేశ్వర రావు, మల్లంపల్లి జయమ్మ, లక్షణస్వామి, మాదిరెడ్డి చిన్న, సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

గన్నవరంలో ఫుట్‌పాత్ ఆక్రమణ తొలగింపు

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరంలో ఫుట్ పాత్ ఆక్రమణలపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. బుధవారం సీఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి జంక్షన్, దావాజిగూడెం, విజయవాడ రోడ్లలోని ఫుట్ పాత్‌లపై ఆక్రమణలు తొలగించారు. షాపుల యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చినా పోలీస్ ఆదేశాలు అతిక్ర మించి పాదచారులకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ సత్యనారాయణ హెచ్చరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

విశాలాంధ్ర-గూడూరు: మల్లవోలు, ఆకులమన్నాడు, కప్పలదొడ్డి గ్రామల్లోని సహకార సంఘం బ్యాంక్/ఆర్.బి.కెలో బుధవారం ఈ ఖరీఫ్ సీజన్ 2022-23 పంటకు ధాన్యం కొనుగోలు కేంద్రం కప్పలదొడ్డి ఆర్‌బికె చైర్మన్ అందే. రాము ప్రారంభించారు. ఆర్‌బికే సచివాలయ టెక్నికల్ అసిస్టెంట్, తుమ్మల బ్రహ్మం, సంఘ సెక్రటరీ పిన్నేరి రామకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతు భరోసా కేంద్రంలో ధాన్యం తేమను నాణ్యతను పరిశీలించి వాటిని పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమానికి పి ఏ సి ఎస్ అధ్యక్షులు షేక్ ఫైజుల్ రెహమాన్ (మున్నా) కప్పలదొడ్డి మాజీ ఎంపీటీసీ సభ్యులు వార్త. రాంబాబు, కప్పలదొడ్డి ఉప - సర్పంచ్, యక్కల. నాగరాజు, పేరిశెట్టి. మధు మరియు గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.

రావివారిపాలెం పాల సొసైటీ అధ్యక్షుడిగా రావి లక్ష్మణరావు

విశాలాంధ్ర-మోపిదేవి : రావివారిపాలెం పాలకేంద్రం అధ్యక్షుడిగా రావి లక్ష్మణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. లక్ష్మణరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ఎండిఎస్ జాన్సన్ బుధవారం ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ.. నామినేషన్లలో రావి లక్షణరావు ప్యానల్ ఒకటి మాత్రమే నామినేషన్ వేయడం జరిగిందన్నారు. 9 మంది సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయగా సభ్యులు రావి లక్ష్మణరావు ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఇంటింటికి ఫ్యామిలీ ఫీజీషియన్

విశాలాంధ్ర-పమిడిముక్కల: గ్రామీణ ప్రాంతాల్లో ఫ్యామిలీ ఫీజీషియన్ విధానంతో మెరుగైన వైద్యం అందించేందుకు దోహదపడుతుందని అలినఖీపాలెం సర్పంచ్ మీర్జా సుల్తానా బేగం అన్నారు.బుధవారం అలినఖీపాలెం లో వీరంకిలాకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డా.,డి.పద్మజా ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమే మాట్లాడుతూ గ్రామం లో వృద్దులు అనారోగ్యం తో వున్నారికి ఆ గ్రామంలోనే బి.పి., షుగర్ రక్త పోటు వంటి దీర్ఘకాలిక రోగాలకు పరిక్షలు జరిపి మందులు ఉచితంగా అందచేస్తారని తెలిపారు. దీనిలో 14 రకాల ల్యాబ్ పరిక్షలకు 64 రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో యంపిటిసి మీర్జా సర్జాద్ అలీ, కో ఆప్షన్ సభ్యులు మీర్జా దియానత్ అలి వైద్య బృందం కె.మంజుల కృప పి.వై.కుమార్ సెక్రటరీ టి.వి.రమణ, కె.కృష్ణమోహన్ ఇ.వెంకట్రావు కె.రమణి పాల్గొన్నారు.

దాల్వా సాగునీటి కోసం రిలే దీక్షలు చేస్తాం

విశాలాంధ్ర-బంటుమిల్లి : ఏడాది దాల్వా పంట సాగునీటి కోసం అవసరమైతే రిలే దీక్షలు చేస్తామని రైతులు ఉద్యమించారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు బుధవారం బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల రైతులు రైతుసంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఇప్పటికే సాగు పెట్టుబడి పెరిగిపోయి తీవ్రనష్టాల్లో ఉన్న రైతన్నగానికి ఈ ఏడాది కూడా దాల్వా లేకపోతే మరింత అప్పులపాలు కావాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సముద్రతీర ప్రాంతమైన బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో పంటకు విరామం ప్రకటిస్తే ఈ ప్రాంత భూములు మరింత చౌడు పారిపోయి వచ్చే ఏడాది కూడా దిగుబడిపై ప్రభావం చూపుతాయన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే కరోనాతో రెండేళ్ళు, గత ఏడాది కేవలం ఒక పంట తోనే రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారన్నారు. అలాగే ఎన్నికల ముందు మూడు పంటలకు నిరుస్తామన్న జోగి రమేష్ ఎన్నికల అనంతరం ఒక పంటకే నీరు ఇస్తాను అనటం, ప్రాజెక్టుల్లో పూర్తిస్థాయిలో నీరు ఉన్న నీరు లేదనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మంత్రి, పెడన ఎమ్మెల్యే జోగి రమేష్‌పైన రైతులు ఆశలు పెట్టుకుని దాల్వా తీసుకురావాలని రైతులు ముక్తకంఠంతో ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రైతు సంఘాల నాయకులు మాట్లాడుతూ అవసరమైతే దాల్వా కోసం అఖిలపక్షం ఆధ్వర్యంలో ఉమ్మడి కార్యాచరణ రూపొందించి దాల్వా పంట సాగునీటి కోసం రిలే దీక్షలు చేస్తామని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. అనంతరం దాల్వపంట సాగునీటి కోసం స్థానిక తాసిల్దార్ ఎం సత్యనారాయణకు వినతి పత్రం అందించారు. అయితే ఈ కార్యక్రమానికి బంటుమిల్లి కృత్తివెన్ను మచిలీపట్నం పోలీసులు వచ్చి పహారా నిర్వహించడం విశేషం. ఈ కార్యక్రమంలో రెండు మండలాలలోని రైతులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

విద్యావంతులను ప్రేరణతో విద్యను అభ్యసించాలి

విశాలాంధ్ర-చల్లపల్లి : విద్య ద్వారా ఉన్నత స్థానాలను చేరుకున్న వ్యక్తుల గురించి తెలుసుకొంటూ వాళ్ళను ప్రేరణగా తీసుకొని పట్టుదలతో విద్యను అభ్యసించాలని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. చల్లపల్లి లోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని సందర్శించి అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు .ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ గతంతో పోల్చుకుంటే ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో అన్ని రకాల సదుపాయాలు ,వసతులు మెరుగ్గా ఉన్నాయని తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డి.కోటయ్య వివిధ రకాల సబ్జెక్టులను అభ్యసించే విధానాలను,మెరుగైన మార్కులను సాధించే మార్గాల గురించి విపులంగా విద్యార్థులకు వివరించారు.ప్రతిభ చూపుతున్న విద్యార్థినులకు బహుమతులు అందచేశారు. అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు మేడేపల్లి సుబ్బారావు, వసతిగృహ అధికారిణి కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల లిస్టు డ్రాఫ్ట్ పబ్లికేషన్

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని 16 సచివాలయ పరిధి లోని 21 గ్రామపంచాయతీలలోని 54 పోలింగ్ కేంద్రాల్లో బుధవారం ఓటర్ల లిస్టులను డ్రాఫ్ట్ పబ్లికేషన్ నిర్వహించారు. తహసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్ పర్యవేక్షణలో చేర్పులు, మార్పులు, తొలగింపులు లాంటి అభ్యంతరాల కోసం ఈ రివైజ్డ్ లిస్టును ప్రకటించారు. కాగా పెదపూడి సచివాలయ పరిధిలో గల పెదపూడిలో ఎంపియుపి ఎలిమెంటరీ పాఠశాలలో గల మూడు పోలింగ్ కేంద్రాలలో, యద్దనపూడిఎంపీపీ ఎలిమెంటరీ పాఠశాలలో గల ఒక పోలింగ్ కేంద్రంలో బిఎల్వోలు, జె కోటేశ్వరరావు (వీఆర్వో), ఎస్ ఎస్ ఆర్ ఆంజనేయులు (వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్), ఎల్ నాగ వెంకట కళావతి (గ్రేడ్ 5 కార్యదర్శి), కంభం రూప (వీఆర్‌ఏ) లు ప్రకటించారు.

అమెరికా లెఫ్టినెంట్ గవర్నర్‌గా మండల వాసి

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని వెంట్రప్రగడనికి చెందిన కాట్రగడ్డ అరుణమిల్లర్ యూఎస్‌ఏ మేరీ ల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా విజయం సాధించారు. ఈ నేపథ్యంలో గ్రామంలోని ప్రజలు బుధవారం సంబరాలు చేసుకున్నారు. అరుణ తండ్రి కాట్రగడ్డ వెంకట రామారావు ఐబీఎంలో పనిచేశారు. అరుణ మిల్లర్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇంజనీరింగ్ స్పెషలిస్ట్ మిస్సోరి యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సివిల్ ఇంజనీరింగ్ చదివారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు తీర్పుపై పునఃసమీక్షించాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు చెల్లుబాటు అవుతాయంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై పునఃసమీక్షించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ బోను దుర్గా నరేష్ డిమాండ్ చేశారు. బుధవారం గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ అగ్ర కులాల్లోని పేదలకు ఆర్థిక పరమైన స్కీములు పెట్టి అభివృద్ధి చేయాలి తప్ప విద్య,ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.రిజర్వేషన్లు పేదరిక నిర్మూలన పథకం కాదని, ఆర్థిక అభివృద్ధి పథకం అంతకంటే కాదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి కులానికి తమతమ జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ, అధికార పదవులలో వాటా ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం 50% సీలింగు సమస్య నేడు లేదు కాబట్టి మరల మురళీధరరావు కమీషను సిఫార్సుల అమలు కొరకు ప్రతి బి.సి ఉద్యమించాలని పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు లక్ష్మణ్,యువజన నగర అధ్యక్షులు పి.సాయికిరణ్,నగర మహిళా అధ్యక్షురాలు మెండెం జ్యోతి, ఎమ్.ప్రసాద్, ఆర్.రామకృష్ణ, టి.శంకర్, బి.నాగుర్, సాహేరా, జయలక్ష్మీ పాల్గొన్నారు.

జగనన్న హౌసింగ్ లే అవుట్లు పరిశీలించిన ఎంపీడీఓ రమణ

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ రూరల్ మండలం బిల్లపాడు సచివాలయం పరిధిలోని నుజేళ్ళలోని జగనన్న హౌసింగ్ లే-అవుట్‌లను ఎంపిడివో వెంకటరమణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ గృహ నిర్మాణ లబ్ధిదారులను త్వరితిగతిన తమ ఇంటి నిర్మాణాలు పూర్తి చేసేందుకై చర్యలను తీసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి లబ్ధిదారులు తమ సొంత ఇంటి కలను నెరవేర్చుకోవాలన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు హక్కు ఆయుధం

విశాలాంధ్ర-పెనమలూరు : ప్రజాస్వామ్య పరిరక్షణకు రాజ్యాంగ బద్ధ ప్రజాప్రతినిధుల ఎన్నికకు ఓటు హక్కు ఆయుధం వంటిదని, 18 యేళ్ళు నిండిన ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కును పొందాలని జిల్లా కలక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. కానూరు విఆర్ సిద్దార్ధ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీకి కలక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో ఎం వెంకటేశ్వర్లు, ఉయ్యూరు ఆర్డీవో విజయ్‌కుమార్, తాడిగడప మున్సిపాల్ కమీషనర్ ప్రకాశరావు, పెనమలూరు తాహశీల్దార్ భద్రూ, ఎంపిడిఓ సునీతశర్మ, డీఈఓ తహెరా సుల్తానా, సాంఘీక సంక్షేమశాఖ డిడి సరస్వతి, బిసి సంక్షేమశాఖాధికారి లక్ష్మీదుర్గ పెద్ద సంఖ్యలో విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

బంటుమిల్లిలో..

రాజీమార్గమే రాజమార్గమంటూ బంటుమిల్లి కోర్టు వారు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. బుధవారం జాతీయ న్యాయ సేవా దినోత్సవాన్ని పురస్కరించుకుని బంటుమిల్లి కోర్టు వారు ప్రత్యేక కార్యక్రమం చేశారు. స్థానిక కోర్టు ప్రాంగణం నుండి బంటుమిల్లి లక్ష్మీపురం సెంటర్ వరకు ర్యాలీ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు యాళ్ల శ్యాంబాబు, ఈవీఎస్ రాయుడు, పళ్లెం వీర వెంకటేశ్వరరావు, తమ్మన సురేష్, సుధా బత్తుల సురేష్, మోజస్, కొప్పర్తి ఆంజనేయులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ జగన్ మోహన్ రావు, సెబ్ సీఐ సతీష్ బాబు, బంటుమిల్లి,కృతి వెన్ను ఎస్ఐలు తదితరులు ఉన్నారు.

గుడివాడలో...

న్యాయం అందరికి సమానంగా ఉంటుందని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.రజని అన్నారు. బుధవారం స్థానిక ఏలూరురోడ్డులోని కోర్టు భవన సందాయల నుండి పట్టణంలో నేషనల్ లీగల్ సర్వీసెస్ డే సందర్భంగా మండల న్యాయ సేవదికర కమిటి అధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా న్యాయమూర్తి రజని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడతూ న్యాయం ముందు పేద, ధనిక అనే తేదాలుండవన్నారు. న్యాయం అట్టడుగువర్గాల అందేలా లోక్ అదాలత్ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ఎ.పూర్ణిమ, సి.హెచ్ కిషోరుకుమార్, నాగలక్ష్మీ, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు అండగా..

విశాలాంధ్ర-కూచిపూడి : సీఎం జగన్ పేదలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందజేస్తూ ఆర్థిక పరంగా అండగా ఉంటున్నారని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. మొవ్వ మండలంలోని అవురిపూడిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. సర్పంచ్ ఏనుగు ఝాన్సీ లక్ష్మి, ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పీటీసి రాజులపాటి పార్వతి, ఎంపీడీవో.జి.. సుధా ప్రవీణ్, తాసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, పంచాయతీ రాజ్ ఏఈ. బి రామారావు, తదితరులు పాల్గొన్నారు

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-గన్నవరం : జాతీయ న్యాయసేవ దినోత్సవ సందర్భంగా మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జయలక్ష్మి ఆదేశాల ప్రకారం స్థానిక గన్నవరం బాలుర ఉన్నత పాఠశాలలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ దాసరి భాగ్యలక్ష్మి అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గన్నవరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అమర్తల సోమేశ్వరరావు మాట్లాడుతూ న్యాయ సేవ దినోత్సవం యొక్క ప్రాముఖ్యత గురించి, బాలలకు సంబంధించి వివిధ చట్టాల గురించి వివరించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న న్యాయవాదులు శారదా, స్వామి, ప్రకాష్, విమల కుమార్ లు పలు చట్టాల గురించి వివరించారు.

విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-గన్నవరం : నవజీవన్ బాల భవన్ విజయవాడ వారి ఆధ్వర్యంలో మండలంలోని నిడమానూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని స్క్రీన్ ప్రొజెక్టర్ ద్వారా బుధవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు మాట్లాడుతూ విద్యార్థులు లక్షసాధనకోసం కృషిచేయాలని, యువత దేశానికి ఆదర్శం కావాలని, అందమైన విలువైన జీవితాన్ని మత్తు పధార్ధాలతో దుర్భరం చేసుకోవద్దు అని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, మత్తు పదార్ధాలు అనేవి ఎటువంటి పతనావస్థకి చేరుస్తాయో ముందుగానే అవగాహనతో తెలుసుకొని సక్రమమైన మార్గంలో జీవించాలని అన్నారు. విద్యార్థులు సోషల్‌మీడియా ఎక్కువగా వాడుతున్నారని, మంచి కోసం మన అభివృద్ధి కోసం ఫోన్‌ను ఉపయోగించాలని, విద్యకు అవసరమైన విషయాలకు ప్రాముఖ్యత ఇవ్వాలని, ఈ చెడు వ్యసనాల ద్వారా ఎంతో మంది విద్యార్థులు వారి జీవితాలను పాడుచేసుకున్నారని, క్రమశిక్షణ కలిగి జీవించాలి అని అన్నారు. ఈ మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నవజీవన్ బాలభవన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్ళమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ మత్తు పదార్థాలు అన్ని కూడా జీవితాన్ని నాశనం చేసేవే అని మాదక ద్రవ్యాలతో జీవితంలో కొన్ని రోజులే జీవిస్తారని మీ జీవితాన్ని అర్ధాంతరంగా ముగించద్దు అని ఎలాంటి మత్తు పదార్థాలు తీసుకున్న కాటికి పయనం కావాల్సిందే అన్నారు. ఈ కార్యక్రమములో నిడమానూరు సచివాలయ మహిళా పోలీస్ లు యన్ లలిత, షైక్ ముబీనా బేగం నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్స్ డి శ్రీవల్లి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బి వి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కాపులకు 5% రిజర్వేషన్లు అమలు చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : కేంద్ర ప్రభుత్వ చొరవతో 103వ రాజ్యాంగ సవరణ ద్వారా దేశవ్యాప్తంగా 'ఆర్థిక బలహీన వర్గాలకు' 10% రిజర్వేషన్స్. కల్పించిన కేంద్ర బిల్లును సుప్రీంకోర్టు సమర్ధించడాన్ని స్వాగతిస్తూ పూర్తిగా సమర్ధిస్తున్నామని, కాపులకు వెనుకబడినవర్గాల జాబితాలో స్థానం కల్పించే వరకు అగ్రవర్ణ పేదలకు (ఈడబ్ల్యూఎస్) కేంద్రం ప్రకటించిన 10% రిజర్వేషన్‌లో '5% రిజర్వేషన్లు' కాపులకు తక్షణమే అమలు చేయాలని, ఆ దిశగా కాపు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని రాష్ట్ర కాపు ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో కాపు రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ ఆరేటి ప్రకాష్,కాపు జెఎసి చైర్మన్ ఆకుల రామకృష్ణ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆనాడు కాపులకు ఇచ్చిన హామీలను అమలు చేటంలో పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాపు నాయకలు నల్లా విష్ణుమూర్తి, వాసిరెడ్డి ఏసుదాసు, నరహరిశెట్టి శ్రీహరి, పిచ్చయ్యనాయుడు, నవనీతం సాంబశివరావు, మాకా శ్రీనివాస్, అడపా నాగేంద్ర, ఎస్.ఎస్.రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: స్థానిక బాలురు హైస్కూల్‌లో 2021-22 విద్యా సంవత్సరానికి 10వ తరగతిలో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు అదే పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మాలోతు శ్రీహరి తల్లితండ్రుల మలోతు మక్యానాయక్ బొడమ్మ జ్ఞాపకార్థం బుధవారం రాష్ట్ర ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మేమెంటోలు అందజేశారు.

వయోజనులు ఓటరుగా నమోదు చేయించుకోవాలి

విశాలాంధ్ర-తిరువూరు: 18 సంవత్సరాలు పైబడిన వయోజనలు ఓటరుగా నమోదు చేయించుకోవాలని ప్రిన్సిపాల్ సుశీలరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జరిగిన ఓటర్ల నమోదుపై అవగాహన ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం ఏడాదిలో 4 సార్లు ఓటర్ల నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. మండల రెవెన్యూ కార్యాలయం, డిగ్రీ కళాశాల ఎన్ ఎస్ ఎస్ సేవా విభాగం అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ హేమ ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ దుర్గా ప్రసాద్, అధ్యాపకులు సునీత, వేణు మాధవ్, చెన్నారెడ్డి, నాగరాజు, చంద్రబాబు, రెవెన్యూ సిబ్బంది పుల్లయ్య, పరం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో సామాజిక న్యాయానికి తిలోదకాలు

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: వైసీపీ పాలనలో సామాజిక న్యాయానికి తిలోదకాలిచ్చారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శావల దేవదత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విస్సన్నపేటలో పలువురు నేతలతో కలసి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక సామాజికవర్గానికే తమ ప్రభుత్వంలో ప్రాధాన్యం ఉంటుందన్న విషయం డీఎస్పీల పదోన్నతిలో స్పష్టమయ్యిందన్నారు. నియోజకవర్గం మొత్తం ఓటరు జాబితాల్లో దొర్లిన తప్పులను గుర్తించే కార్యక్రమం చేపట్టామని, త్వరలో అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సరిదిద్దనున్నామన్నారు. ఆయనతోపాటు మండలపార్టీ అధ్యక్షుడు మట్టా వేణుగోపాలరావు, నాయకులు నెక్కళపు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, నాదెళ్ల నాగమణి, కె.రాజచంద్రమౌళి, మొవ్వ లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

అల్లూరు సెక్టర్లలో ఆకస్మిక తనిఖీలు

విశాలాంధ్ర-వీరులపాడు: విద్యుత్ చౌర్యం సామాజిక నేరం, విద్యుత్ చౌర్యం చేసే వారికి అపరాధ రుసుం, జైలు శిక్ష కూడా పడే అవకాశం ఉందని విజయవాడ రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.బి శ్రీనివాసరావు తెలిపారు. వీరులపాడు మండలం అల్లూరు సెక్టార్ పరిధిలో విద్యుత్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఉద్యోగులు 39 బృందాలుగా ఏర్పడి అల్లూరు సెక్టార్ లో తనిఖీలు నిర్వహించి 280 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అదనపు లోడు వాడే వారిపై 279 కేసులు నమోదు చేయగా, ఒక కేసు నమోదు చేయగా రూ.6.75 లక్షల అపరాధ రుసుం వేసినట్లు తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడినట్లయితే 9440812085 మొబైల్ నెంబర్ కు సంప్రదించవలెనని తెలిపారు. ఈ తనిఖీలు విజయవాడ రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.బి శ్రీనివాసరావు,నందిగామ డిఈఈ హరిబాబు, జగ్గయ్యపేట డిఈఈ గోవిందరాజులు, ఇబ్రహీంపట్నం డిఈఈ కొండలరావు, ఏఈ బి.ఆర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులు భర్తీ చేయాలి : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-గంపలగూడెం : ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, ఈనెల 25న చలో ఢిల్లీ, పార్లమెంట్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పరుచూరి రాజేంద్రబాబు తెలిపారు. అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం చలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను స్థానిక గాంధీ సెంటర్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని, భగత్‌సింగ్ నేషనల్ ఎంప్లాయిమెంట్ గ్యారంటీ యాక్ట్‌ను అమలు చేయాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని నిలిపివేయాలని, దేశవ్యాప్తంగా ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నవంబర్ 25వ తేదీన నిర్వహించే చలో ఢిల్లీ పార్లమెంట్ మార్చ్ కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నుండి నిరుద్యోగ యువత పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు లంక. గోవిందరాజులు, సీపీఐ తిరువూరు నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా, పట్టణ కార్యదర్శి గౌర్రాజు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.32 కోట్లతో అదనపు గదుల నిర్మాణం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట: స్థానిక బాయ్స్ హైస్కూల్‌లో నాడునేడు కార్యక్రమం లో భాగంగా రూ.1.32 కోట్లతో 11 అదనపు తరగతి గదుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ సీఎం జగన్ దేశంలోనే ఎక్కడా లేని విధంగా నాడు నేడు కార్యక్రమం ద్వారా ప్రవేట్ స్కూల్స్‌కు ధీటుగా ప్రభుత్వ స్కూల్స్‌ను నిర్మిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర,వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, రాష్ట్ర పూసల కార్పొరేషన్ డైరెక్టర్ చేని కుమారి, జడ్పిటిసి ఊట్ల నాగమణి, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్ పట్టణ మహిళా అధ్యక్షురాలు ముసిని రాజ్యలక్ష్మి, కౌన్సిలర్ నూకల సాంబ, కోఆప్షన్ సభ్యులు ఖాదర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

13న రాష్ట్ర స్థాయి విద్యార్థినుల సమ్మేళనంలో పాల్గొనండి

విశాలాంధ్ర-విజయవాడ : దేశంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలు, నూతన జాతీయ విద్యా విధానం అమలు, బాలికలు మహిళల పట్ల వివక్షతపై ఈ నెల 13న విజయవాడ నగరంలో జరుగనున్న రాష్ట్ర స్థాయి విద్యార్థినుల సమ్మేళనంలో పాల్గొని విజయవంతం చేయాలని అఖిలభారతవిద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర కోశాధికారి మందగళ్ళ సాయి కుమార్ కోరారు. విద్యార్థి సమాఖ్య జాతీయ స్థాయిలో నూతన విద్యార్థుల సభ్యత్వ నమోదు పిలుపు మేరకు బుధవారం గుణదల లో ఉన్న ప్రభుత్వ వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ వసతి గృహం నందు వివిధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థినులతో ముఖాముఖి నిర్వహించారు. వారిని ఉద్దేశించి సాయికుమార్ మాట్లాడుతూ విద్యార్థి ఉద్యమ చరిత్ర వివరించారు. ఈ నేపథ్యంలో సమాఖ్య రాష్ట్ర కమిటీ నేతృత్వంలో ఈ నెల 13న నగరంలోని దాసరి భవనం నందు జరిగే సమ్మేళనంలో భాగస్వామ్యం కావాలని కోరారు. అనంతరం సమాఖ్య బాలికల కన్వీనర్ మోతుకూరి అభ్యుదయ విద్యార్థుల నుండి సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నగర నాయకులు చందు, సుధీర్ పాల్గొన్నారు.

రేపు ఏఐటీయూసీ నిరసనలు

విశాలాంధ్ర-విజయవాడ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12న ఆంధ్రప్రదేశ్ పర్యటన సందర్భంగా అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపుమేరకు ఈ నెల 11వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసనలు నిర్వహించాలని ఏఐటీయూసీ కృష్ణాజిల్లా కన్వీనర్స్ టీ తాతయ్య, కొరారి రమణ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసినారు

'రవీంద్రభారతీ' ఫ్యాన్సీడ్రస్ పోటీలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్) : వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి, నేతాజీ సుభాష్ చంద్రబోస్, జవహర్ లాల్ నెహ్రూ వంటి జాతీయ నేతలు ఒకవైపు, పెళ్లికూతురు-పురోహితుడు-సైనికుడు- రైతన్న ఇలా అనేక మంది మరోవైపు విజయవాడ మారుతీనగర్ లోని రవీంద్రభారతి పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఫ్యాన్సీడ్రెస్ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎల్‌కేజీ, యూకేజీ పిల్లలకు జాతీయ నాయకుల చరిత్ర, త్యాగాలు, భారతీయ సంప్రదాయాలు, వృత్తులపై అవగాహన కల్పించే విధంగా ఈ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వై. అంకమ్మరావు, ఉపాధ్యాయులు ఝాన్సీ, శ్రీ తన్య, అఫ్రీన్ , భాను, దేవి, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మండల సమైఖ్యకు సన్మానం

విశాలాంధ్ర-వత్సవాయి: మండల మహిళా సమైఖ్య అధ్యక్షురాలిగా ఎన్నికైన గంగిపోగు శిరీష రమేష్‌లను రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మండలంలోని లింగాల మామిడి తోటలో అభినందన సభలో శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలను అభివృద్ధి పథంలో నడిపించడానికి నాలుగడుగులు ముందుకు వేస్తుందని, మహిళా సాధికారిత పురోభివృద్ధి వైయస్సార్ చేయూత అనేక సంక్షేమ పథకాలను మహిళల ముందుంచిన ఘనత ఒక జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైసిపి నాయకులు కార్యకర్తలు జడ్పిటిసి ఏసు పోగు దైవమని శ్రీనివాస్ వైకాపా సర్పంచులు ఎంపీటీసీలు సొసైటీ అధ్యక్షులు ఏపీఎం వివో లు యానిమేటర్స్ డ్వాక్రా మహిళలు తదితర వెలుగు సిబ్బంది భారీ స్థాయిలో పాల్గొన్నారు.

రేపు శతాబ్ది గాయకుడు ఘంటసాల శతజయంతి

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : శతాబ్ది గాయకుడు ఘంటసాల శతజయంతిని పురస్కరించుకొని ఈ నెల 11న శుక్రవారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయం హాలులో ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక, తెలుగు కళావాహిని,ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ, శ్రీ కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో ఘంటసాల పాటలతో సినీ సంగీత విభావరి జరుగుతుందని చింతకాయల చిట్టిబాబు తెలిపారు.

4 ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

విశాలాంధ్ర-వత్సవాయి : స్థానిక ఎస్ఐ అభిమన్యు పెంట్యాల వారిగూడెం మీదుగా తెలంగాణ వెళ్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను అదుపులోనికి తీసుకొని వాటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గుట్కా మరియు జూదం అక్రమ ఇసుక రవాణా మొదలైన చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టాలు కఠినంగా ఉన్నాయని ఎంతటి వారికైనా శిక్షలు తప్పవని హెచ్చరించారు.

కోళ్ల ఫారం గుమస్తా కిడ్నాప్ కలకలం

విశాలాంధ్ర-విజయవాడ క్రైమ్: పాలకొల్లుకు చెందిన కోళ్లఫారంలో గుమస్తా కిడ్నాప్ వ్యవహారం విజయవాడలో కలకలం సృష్టించింది. పాలకొల్లు నుంచి సాయిరామ్(31)ను బలవంతంగా కారులో ఎక్కించుకుని విజయవాడ పోలవరం లాకులకు తీసుకువచ్చారు. వివరాల్లోకి వెళ్లితే విజయవాడ రూరల్ నున్న ప్రాంతంలో కోళ్ల ఫారం నిర్వహకుడు సాయి మణిదీప్ ఏడాది క్రితం రూ.5లక్షల విలువ చేసే కోళ్లను సాయిరామ్‌కు ఇచ్చాడు. అప్పటి నుండి డబ్బులు ఇవ్వకపోవడంతో పాలకొల్లు నుండి బలవంతంగా కారులో ఎక్కించుకుని విజయవాడకు తీసుకువచ్చారు. బాధిత బంధువులు వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో సాంకేతిక పరిజ్ఞానంతో పోలవరం లాకుల వద్ద ఉన్న కోళ్ల ఫారంలో ఉన్నట్లు తెలుసుకున్నారు. అక్కడి చేరుకున్న పోలీసులు బాధితుడిని రక్షించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

నేడు 'పాపులర్ షూ మార్టు' 60వ వార్షికోత్సవ సంబరాలు

విశాలాంధ్ర-విజయవాడ : చుక్కపల్లి పిచ్చయ్యచే స్థాపించిన 'పాపులర్ షూ మార్టు' 60వ వార్షికోత్సవ సంబరాలు ఈ నెల 10న 5.30 గంటలకు లబ్బీపేట కాట్రగడ్డ పిచ్చయ్యవీధిలోని ఎస్.ఎస్.కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించనున్నట్లు పాపులర్ షూ మార్టు మేనేజింగ్ పార్టనర్ చుక్కపల్లి అరుణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శైలజాకిరణ్, గౌరవ అతిథిగా శాంతా బయోటెక్నిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

12 నుంచి యువ సంగీత సమ్మేళనం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి ఆధ్వర్యంలో స్టార్ హాస్పిటల్స్(బంజారా హిల్స్, హైదరాబాద్), శృం గేరి శారదాపీఠ మహాసంస్థాన్ పరిపాల్యమాన శివరామకృష్ణ క్షేత్రం (రామకోటి) సౌజన్యంతో 12 నుంచి 14 వరకు రామకోటి ప్రాంగణంలోని శీతల మందిరంలో యువ సంగీత సమ్మేళనం జరుగుతుందని సమితి కార్యదర్శి సివి రావు తెలిపారు.

జిల్లా కారాగారంలో న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఖైదీల పరివర్తనలో భాగంగా ప్రతి కారాగారంలో స్కిల్ డెవలప్ మెంట్ ఏర్పాటు చేయాలని తద్వారా ఖైదీలకు పునరావాసం కల్పించవచ్చు అని ఆంధ్రప్రదేశ్ లీగల్ సర్వీస్ అథార్టీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సి.ప్రవీణ్ కుమార్ తెలిపారు. గాంధీనగర్‌లోని జిల్లా కారాగారంలో బుధవారం పాన్ ఇండియా, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఖైదీల పరివర్తనలో భాగంగా ప్రతి కారాగారము నందు స్కిల్ డెవలప్మెంట్ ఏర్పాటు చేయాలని తద్వారా ఖైదీలకు పునరావాసం కల్పించవచ్చు అన్నారు. జిల్లా కారాగారములో ఉన్న ఖైదీల బ్యారక్‌లను, కిచిన్ గది, స్కిల్ డెవలప్మెంట్ కేంద్రమును ను సందర్శించారు. ఖైదీలకు కార్ట్స్, పండ్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమములో జిల్లా ప్రధాన న్యాయ మూర్తి అరుణ సారిక, మెంబర్ సెక్రటరీ ఎం. భాబిత, ఎమ్ఎల్ఎస్ఎ ఛైర్మన్, 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి వి. శ్రీనివాస అంజనేయమూర్తి, గంటూరు డిఐజి డా. ఎం.వరప్రసాద్, పర్యవేక్షణాధికారి ఎం.డి ఇర్ఫాన్, జైలర్స్ బి.రత్న రాజు, ఎన్.గణేశ్, డిప్యూటీ జైలర్ సి హెచ్.వేణు, బి. గోపైయ్య నాయక్, కారాగార సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు వరం.... జగనన్న ప్రభుత్వం

విశాలాంధ్ర-ఏ కొండూరు : పేద ప్రజలకు వరం జగనన్న ప్రభుత్వం అని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణ నిధి అన్నారు. ఈ కొండూరు మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో మూడవ విడత గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమానికి బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను గడపగడపకు వెళ్లి ప్రజలకు అర్థమయ్యేలా వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు జడ్పిటిసి భూక్యాగనియా ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి చెన్నారావు వైస్ ఎంపీపీ గుంటక శివారెడ్డి సర్పంచ్ ముచ్చు సీతయ్య వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎం వెంకటేశ్వరరావు మోర్ల సాంబశివరావు గుర్రాల వెంకట్రావు పాలెం ఆంజనేయులు నరెడ్ల వీరారెడ్డి కోట పుల్లారావు కుక్కల వైకుంఠరావు మారిపోకు మహేష్ వజ్రాల బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు అదేవిధంగా మండల అధికారులు తహసిల్దార్ సిహెచ్ వెంకటేశ్వర్లు ఎంపీడీవో నాగేశ్వరరావు ఏఓ టిప్పు సుల్తాన్ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ లక్ష్మి ఎస్ఐ అంకారావు పి ఆర్ ఎ ఈ సాంబశివరావు పంచాయతీ కార్యదర్శి శోభన్ బాబు సచివాలయ కార్యదర్శి నాగబాబు సచివాలయ సిబ్బంది వలింటర్లు అంగన్వాడీ టీచర్లు ఆశ వర్కర్లు డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సమ్మోహనం సినీ స్వర పరిమళం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : ఫ్రెండ్స్ ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కౌతా పూర్ణానందం సత్రం హాలులో జరిగిన సినీ సంగీత విభావరి శ్రోతలను ఆద్యంతం సమ్మోహన పరుస్తూ సాగింది. సంస్థ వ్యవస్థాపకుడు సయ్యద్ అలీ గాయనిలు పావని, భానుశ్రీలను పుష్పమాలాంకృతులను చేసి దుశ్శాలువలతో అభినందిస్తూ సత్కరించారు. గాయనీ, గాయకులుగా పావని, భానుశ్రీ, రసూల్ బాబు, సయ్యద్ అలీ, కుటుంబరావు, ప్రసాదరావు, మణి, వాసు, రమేష్‌లు పాటకు శృతి, లయ, సాహిత్యం ఎంత అవసరమో తెలుపుతూ ఆ మూడింటి సమ్మేళనంతో పాటలోని మాధుర్యాన్ని వారు ఆస్వాదిస్తూ శ్రోతలచే ఆస్వాదింప చేస్తూ భావరసానుభూతిని కలిగించారు. వేదికపై అతిథులుగా,డేవిడ్ రాజు, ఆదిరాల జయప్రభ,శివశర్మ,శ్రీనివాసరావు, కారుమంచి రాజు, తదితరులు ప్రసంగించారు.

మిక్ ఆధ్వర్యంలో జాయ్ ఆఫ్ గివింగ్

విశాలాంధ్ర-కంచికచర్ల : కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ ఎన్. ఎస్. ఎస్ విభాగము ఆధ్వర్యం లో ప్రతి ఏటా నిర్వహించే జాయ్ అఫ్ గివింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమం లో భాగంగా ప్రతి ఏటా కళాశాల విద్యార్థులు ప్రతి ఒక్కరు ఒక్కో వస్తువు గాని, నిత్యావసర సరుకులు గాని పండ్లు, బట్టలు, వంటి వాటిని వితరణగా ఎన్. ఎస్. ఎస్ విభాగానికి అందిస్తారు. ఎన్. ఎస్. ఎస్ విద్యార్థులు వాటన్నిటిని సేకరించి వాటిని అనాధ శరణాలయానికి కానీ వృద్ధాశ్రమానికి అందిస్తారు. ఈ సంవత్సరం కూడా విద్యార్థులు మరియు అధ్యాపక బృందం అందించిన 20 రకాల నిత్యావసరాలను ఎన్. ఎస్. ఎస్ విద్యార్థులు సేకరించి, బుధవారం విజయవాడ లో మదర్ థెరిస్సా ప్రేమ్ దాన్ ఆశ్రమానికి వితరణ గా అందించారు. వీటిలో 100 కిలోల బియ్యం, 100 బ్రష్ లు, పేస్ట్ లు, 100 సబ్బులు ,100 షాంపూలు, పౌడర్ టిన్ లు, 80 కిలోల గోధుమ పిండి, 80 కిలోల పంచదార, మినపగుళ్ళు, సన్ ఫ్లవర్ ఆయిల్ తదితర నిత్యావసరాలు ఉన్నట్లు ఎన్. ఎస్. ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్. జి. రాజేష్ తెలిపారు. విద్యార్థులు ఆశ్రమాన్ని సందర్శించి, అక్కడ ఉన్న మానసిక వికలాంగులతో కొద్ది సమయం గడిపి వారితో ఆనందాన్ని పంచుకున్నారు.

గురుకుల విద్యాలయాల పనితీరుపై సమీక్ష

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న గురుకుల పాఠశాలల పనితీరుపై బుధవారం కొండపర్వ గిరిజన సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాలలో జిల్లా అధికారులు సమీక్ష నిర్వహించారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో ప్రస్తుతం ఆశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న మూడు బాలుర, నాలుగు బాలికల పాఠశాలలు, ఒక ఆశ్రమ పాఠశాల, ఒక కళాశాల పనితీరు, ఇక్కడ విద్యార్థులకు అందాల్సిన సంక్షేమ విధానాలపై ఈ సమావేశంలో అధికారులు చర్చించారు. విద్యాప్రమాణాల పెంపు, మౌలిక సదుపాయాల ఏర్పాటుపై తీసుకోవలసిన పలు చర్యలను ఈ సందర్భంగా పలువురు ప్రిన్సిపాళ్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రిన్సిపల్ బీఎస్.స్వర్ణలత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి ఎం.రుక్మాంగదయ్య, సహాయాధికారి ఫణి దూర్జటి, ఉమ్మడి కృష్ణా కోఆర్డినేటర్ జాన్సన్ దేవరాజ్, పలువురు ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

నగరంలో ఎస్ఆర్ అండర్ వాటర్ టన్నెల్ ఎక్స్‌పో ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : నగర వాసులకు ఆహ్లాదాన్ని అందించేందుకు బందర్ రోడ్డు ఎ కన్వెన్షన్ రోడ్ లోని వజ్ర గ్రౌండ్స్ లో ఏర్పాటుచేసిన ఎస్ఆర్ అండర్ వాటర్ టన్నెల్ ఎక్స్‌పోను వైసిపి తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి దేవినేని అవినాష్ ముఖ్యఅతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రెహానా నాహీద్ పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడాలి

విశాలాంధ్ర-తిరువూరు: బాలల హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని హెచ్ ఎం హుస్సేన్ అన్నారు. మండలంలోని రోలుపడి ఎంపీయూపీ పాఠశాలలో చైల్డ్ రైట్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. కిషోర బాలలకు ఉన్న చదువుకునే హక్కు జీవించే హక్కు ఆడుకునే హక్కు, కనీస అవసరాల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హుస్సేన్ కోరారు. ఐడియాస్ సేవాసంస్థ ఆధ్వర్యంలో రోలుపడి గ్రామంలోని ప్రైమరీ స్కూల్ లో, సచివాలయం, అంగన్వాడి కేంద్రాలలో సంస్థ కో ఆర్డినేటర్ ఎస్ అభి బాలల హక్కులను వివరించారు. ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు కరెంటుండని ప్రాంతాలు

విశాలాంధ్ర-విజయవాడ : మొగల్రాజపురం సెక్షన్, లబ్బీపేట విద్యుత్ ఉపకేంద్రం, 11కేవీ బందర్ రోడ్డు 2 ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మత్తులు, మెయింటినెన్స్ నిమిత్తం గురువారం ఉదయం 8 నుండి 10 గంటల వరకు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజనీరు బీవీ.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతములు పిచ్చయ్య స్ట్రీట్, బందర్ రోడ్డు, గోలి సిల్క్స్ ఏరియా, ఎస్‌వీసీ జ్యువెలర్స్ ఏరియా, పాత పోస్ట్ ఆఫీస్ రోడ్డు, టిప్సీ టాప్సీ, వరమహాలక్ష్మి రోడ్డు, రుక్మిణి కృష్ణ రైస్ మిల్ రోడ్డు, డింపుల్ బార్ ఏరియా, తుర్లపాటి కుటుంబరావు వీధి, దత్తి కనకయ్య వీధి, తెంటు గౌరయ్య వీధి, ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం తదితర ప్రాంతాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రైలు నుండి పడి వ్యక్తి మృతి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైలు నుండి జారీ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ పి.పార్థసారధి బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ప్రకారం రైల్వేస్టేషన్‌లోని 9వ నెంబర్ ప్లాట్‌ఫామ్ చివర సుమారు 30నుండి 40 సంవత్సరాల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సమాచారం వచ్చిందన్నారు. అక్కడకు వెళ్ళి పరిశీలించగా మృతుడు 5.5 అడుగులు ఎత్తుతో చామనఛాయ రంగు కోల ముఖం కలిగి ఉన్నాడు.శరీరంపై ఆరంజ్, నాలం రంగుల టీషర్టు,లైట్ సిమెంట్ రంగు లోయర్ ధరించి ఉన్నాడు. కుడి అరచేతి వెనుక భాగంలో ఓం అని మోచేతి క్రింత తెలు బోమ్మ గల పుట్టుమచ్చలు ఉన్నాయి. అంతకుమించి వివరాలు లభించలేదన్నారు.మృతి చెందిన విధాన చూసి రైలు నుండి జారీ మృతి చెందినట్లుగా అనుమాని స్తున్నామన్నారు.అతని వివరాలు తెలిసినట్లయితే రైల్వే పోలీస్ స్టేషన్‌లో గాని, 0866-2576006 సంప్రదించాలని కోరారు.

అండర్-17 బాలికల విభాగంలో విద్యార్థిని ప్రతిభ

విశాలాంధ్ర-వీరులపాడు: జుజ్జూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వెల్లంకి నిఖిత రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్‌కు అర్హత సాధించి నందుకు ఉన్నత పాఠశాల ఇంచార్జ్ హెచ్‌ఎం సూరిబాబు విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపారు. అండర్-17 బాలికల విభాగంలో ఉమ్మడి కృష్ణాజిల్లా బాల్ బ్యాడ్మింటన్ బాలికల ఫైనల్ సెలక్షన్స్‌ను విజయవాడ సివిఆర్ మున్సిపల్ కార్పొరేషన్ క్రీడా మైదానంలో నిర్వహించగా జుజ్జూరు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వెల్లంకి నిఖిత రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు అర్హత సాధించినట్లు ఫిజికల్ డైరెక్టర్ వైవి నారాయణ తెలిపారు. జుజ్జూరు జడ్పిహెచ్ పాఠశాల ఉపాధ్యాయుల బృందం నిఖితకు క్రీడా దుస్తులను బహుకరించి శుభాకాంక్షలు తెలిపారు.

కన్నుల పండుగగా.. బాబా ఉరుసు ఉత్సవ్

విశాలాంధ్ర-ఏ కొండూరు : సూఫీ షెహన్షా హజరత్ మహమ్మద్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా వారి చరిత్రాత్మక తొలి ఉరుసు ఉత్సవ్-2022 బుధవారం చీమలపాడులో ఘనంగా జరిగింది. ఈ మేరకు రెండో రోజు జరిగిన ఉరుసు ఉత్సవ్ లోని కీలక ఘట్టాలను అతావుల్లా బాబా వారసులు, చీమల పాడు, విజయనగరం దర్గా-దర్బార్ ల పీఠాధిపతులు ఎండీ ఖ్వాజా మొహియుద్దీన్, ఎండి ఖలీల్ షరీఫ్ షా వెల్లడించారు. బుధవారం వేకువజామున హజరత్ అతావుల్లా షరీఫ్ షా తాజ్ ఖాదరీ బాబా దివ్య సమాధికి గుశుల్(శుద్ధి స్నానం) చేయించారు. బాబా వారి కుమారులు జాఫర్ బాబు, ఖాదర్ బాబు, ఆయన శిష్యులు మరిశర్ల సీతాపతి రావు ఉరుసు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సిఫార్సులకు తలొగ్గేదిలేదు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాష్ట్ర ప్రజాప్రతినిధుల సిఫార్సులకు తలొగ్గేదిలేదని రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ ఛైర్మన్ ఖాదర్ బాషా అన్నారు. బుధవారం విజయవాడలోని రాష్ట్ర వక్ఫ్‌బోర్డ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు సిఫార్సులు వచ్చిన మాత్రనా భూములు కేటాయింపులు చేసేది లేదని, బోర్డ్ సభ్యుల సమావేశం తర్వాత ప్రభుత్వ అనుమతితో పారదర్శకంగా ఓపెన్ ఆక్షన్ విధానం ద్వారా భూముల కేటాయింపులు జరుగుతాయని తెలిపారు. డిప్యూటీ ఛైర్‌పర్సన్ జకీయా ఖానమ్ కొందరికి సిఫార్సు చేసిన మాట వాస్తమేనని అంత మాత్రన భూములు కేటాయింపులు జరగావని తెలిపారు. గుంటూరు పెదకాకాని దగ్గర ఉన్న వక్ఫ్ స్థలాన్ని రూ.1.80 కోట్లతో రోడ్డు, ప్రహరీ నిర్మించి అభివృద్ధి చేస్తున్నామని వివరిం చారు. విజయవాడలోని గాలిబ్ షహీద్ దర్గాకు రూ. కోట్ల విలువైన 120 ఎకరాల ఆస్తులుంటే అక్రమ ఐలతో కుదించుకుపోయిందని చెప్పారు. రెడ్డిపాలెంలో 183 ఎకరాల భూములున్నాయని అందులో మూడెకరాలకు సంబంధించి 1948లోనే సేల్ డీడ్ ఉందని చూపిస్తున్నారని పేర్కొన్నారు. వక్ఫ్ భూములు నిషిద్ధ భూముల జాబితాలో ఉంటాయని, కనుక పట్టా ఉన్నా, ఆక్రమించిన వారి వెనుక ఎంత పెద్దవారున్నా దానిని రద్దు చేసేలా సీఎం చర్యలు తీసుకుంటారని ఖాదర్ బాషా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బోర్డ్ డైరెక్టర్ బషీరుద్దీన్ పాల్గొన్నారు.

నియోజకవర్గస్థాయి పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆదేశానుసారం ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని నిర్వహిస్తున్న క్రీడాపోటీలలో నియోజకవర్గ స్థాయి పోటీలను ఇందిరాగాంధి మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో శాసనసభ్యులు మల్లాదివిష్ణు బుధవారం ప్రారంభించారు. విజయవాడ ఈస్ట్, వెస్ట్, సెంట్రల్ నియోజకవర్గాల నుంచి 100 మంది క్రీడాకారులు క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ క్రీడాంశాలలో పోటీపడ్డారు.

NANDIGAMA NAGARA PANCHAYAT

Box Tender Notice

Roc.No.363/2022/E1, Dated: 09-11-2022

S. No	Name of the Grant	No.of Works	Estimate Amount (In Lakhs)	Opening date	Closing date
1.	General Funds	18	Rs.16,93,050/-	10.11.2022 @ 10.30am	18.11.2022 @ 04.00pm
	Total		Rs.16,93,050/-		

Note : All rights are reserved to the Commissioner to cancel or Reject the tenders without any reasons (As per G.O.Ms.No.94, Dt : 01-07-2003 I & CAD) Further details can be seen@ 'e' procurement market place @ www.tender.apeprocurement.gov.in

Contact No : 9490781856, 8341509213

Commissioner,
Nandigama Nagara Panchayat

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ రంగ సంస్థ) | అజిత్‌సింగ్ నగర్ బ్రాంచి, విజయవాడ, కృష్ణా జిల్లా.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరచు ప్రకటన (30 రోజుల ప్రకటన)

(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002

ఋణగ్రహీత (లు) /కో అప్లికెంట్ (లు) / తనఖాదారు (లు) : 1) శ్రీ బలుగూరి వెంకటేశ్వరరావు, తండ్రి : నరసయ్య, డి.నెం. 43-107/1-2ఎ, కనకదుర్గ నగర్, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ-520015. **2) శ్రీమతి బలుగూరి శ్రీ వెంకట పద్మావతి,** భర్త: వెంకటేశ్వరరావు, డి.నెం. 43-107/1-2ఎ, కనకదుర్గ నగర్, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ - 520015. **3) శ్రీ ఉమామహేశ్వరరావు,** తండ్రి : వెంకటేశ్వరరావు, డి.నెం. 43-107/1-2ఎ, కనకదుర్గ నగర్, అజిత్‌సింగ్ నగర్, విజయవాడ-520015.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, (యాక్టు 54 యొక్క 2002) ప్రకారం పూర్వపు ఆంధ్రాబ్యాంక్, ఇప్పుడు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అజిత్‌సింగ్ నగర్ బ్రాంచి, బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

SARFAESI చట్టం 13(2) విభాగం పరిధిలో నేను / బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 30-06-2022** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేదీ. 06-09-2022**న అధీకృత అధికారి స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. దిగువ ఆస్తి అమ్మకంనకు నిర్ణయించిన రిజర్వు ధర **రూ. 78,00,000/- (అక్షరాలా డెబ్బై ఎనిమిది లక్షల రూపాయలు మాత్రమే).** సదరు చెప్పిన ఆస్తిని కొనుగోలు చేయుటకు బిడ్డరు ఎవ్వరూ ముందుకురాని పక్షంలో, మా బ్యాంక్ వారి రికవరీ విధాన మార్గదర్శకముల ప్రకారం, ఇ-వేలం యొక్క ప్రతిసారి రిజర్వు ధర తగ్గించబడునని దయచేసి గమనించగలరు.

విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది.

(ఎ) ఇదేతరహా సెక్యూర్డ్ ఆస్తుల లావాదేవీలు చేస్తున్న లేదా ఇతరత్రా ఇట్టి ఆస్తులు కొనుగోలు పట్ల ఆసక్తి గల వ్యక్తులు నుండి కొటేషన్లు పొందుట లేదా (బి) పబ్లిక్ నుండి టెండర్లు కోరుట ద్వారా లేదా (సి) బహిరంగ వేలం నిర్వహించుట ద్వారా లేదా (డి) ప్రైవేటు ఒప్పందం ద్వారా కూడా ఆస్తి విక్రయించవచ్చును.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా అలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది. 30-06-2022** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. (**SARFAESI** చట్టం, 2002, 13(8) పరిధిలో విడిపించుకునే హక్కు లభిస్తుంది). అట్లుచేయనిచో, పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

షెడ్యూల్ ఆస్తులు

విజయవాడ, ముత్యాలంపాడు, అంబాపురం రోడ్డు దగ్గర, ఆంధ్రపత్రిక ఎంప్లాయిస్ కాలనీ, ఎదుటి డోర్ నెం. 43-107/1-107, అసిస్ట్ నెం. 139665, ఆర్.ఎస్.నెం. 5/1, ప్లాట్ నెం. 98 వద్ద 272 చ॥గ॥ల విస్తీర్ణంలోని ఖాళీ నివాస స్థలము. **హద్దులు : తూర్పు :** 33 అ॥ వెడల్పు గల మున్సిపల్ రోడ్డు, **దక్షిణం :** టి.యం. శేషశయన రామ్‌నాయుడు గారికి చెందిన ప్లాట్ నెం. 97, **పడమర :** వి. దేవరాజు ఇతరులకి విక్రయించిన ప్లాట్ నెం. 78, **ఉత్తరం :** వి. దుర్గారావు గారికి చెందిన ప్లాట్ నెం. 99

తేది : 08-11-2022
ప్రదేశం : విజయవాడ

సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

In the Court of the 3rd Addl Junior Civil Judge at Vijayawada
O.S.No: 300/2022.

Between :
M/s. Lakshmi Finance pvt. Ltd.,
Reptd., by it's Authorised person,
Gorrela Suresh - Plaintiff
And
Sesham Naveen & Other - Defendants
To,
ప్రతివాది **No :- 1**
Sesham Naveen, S/o. Sankara Rao, Hindu, aged about 36 years, R/o. D.No.11-38, Nethaji Nagar, Nandigama Village & Mandal, Krishna District - 521185.

పై నెంబరు దావా ప్రొసీడింగ్స్‌లో ఒకటవ ప్రతివాదికి వాది పంపిన నోటీసులు అందక పోవుట వలన పై తెలిపిన కోర్టు నందు **ది.29-12-2022**వ **తేదీన ఉదయం గం. 10.30ని॥లకు** ప్రత్యక్షంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు కావలెను. అట్లు కానిచో సదరు దావా ప్రొసీడింగ్స్ మీ పరోక్షమందు తీర్మానించగలరని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

వాయిదా **తేది : 29-12-2022**
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

ఐ. వెంకటేశ్వరరావు
వాది తరపు అడ్వకేట్, విజయవాడ - 2
సెల్ : 9848150815.

జనరల్ నోటీస్
మహారాజశ్రీ 15వఅదనపు జిల్లా జడ్జికోర్టు : నూజివీడు
జిడబ్ల్యుఓపి నెం : 29/2022

పిటీషన్ :
తాళ్ళూరి జ్యోతి - పిటిషనర్
మరియు
ఎల్ఐసి హౌసింగ్ ఫైనాన్స్‌లిమిటెడ్ - రెస్పాండెంట్

పై నెంబరు దావాలో తాళ్ళూరి జ్యోతి పిటిషనర్‌గా పై కోర్టులో మైనర్ వాటాకు చెందిన పిటిషన్ షెడ్యూలు ఆస్తిని అమ్ముటకు కోర్టు వారి అనుమతి కోరుచు పిటిషన్ దాఖలు చేసినారు. ఈ పిటిషన్ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైన ఎటువంటి అభ్యంతములు, ఆక్షేపణలు క్లయిములు, ఎటాచ్‌మెంట్లు ఉన్న యెడల పై కోర్టు వారు నందు **16-11-2022 ఉదయం 10.30**గం॥లకు వ్యక్తిగతముగా హాజరై తాము అభ్యంతరము తెలియపర్చవలెను. లేనిచో ఎటువంటి అభ్యంతములు లేవని తీర్మానించి తదుపరి ఉత్తర్వులు మహారాజశ్రీ కోర్టువారిచే జారీ చేయబడును.

షెడ్యూలు ఆస్తి : **1/6th** షేరుకు సంబంధించి 194.3 చదరపు అడుగులు, 162.46 మీటర్లు ఆర్‌సిసి బిల్డింగ్ ఆర్‌యస్ నెం : 123/1, 123/2, 123/3 ప్లాటు నెం : 178, నదిమ్ తిరువూరు విలేజ్, తిరువూరు మండలం, యన్‌టిఆర్ జిల్లా, సబ్‌రిజిష్టర్. **తూర్పు : 40 లింకులరోడ్డు, దక్షిణము : ప్లాటు నెం : 179,** పడమర : ప్లాటు నెం :**202, ఉత్తరము : 30 లింకుల రోడ్డు**

పి. శ్రీనివాస్, అడ్వకేట్
విజయవాడ సెల్ : 9849770625